క్లుప్తంగా

భవానీ ఐలాండ్‌ను మరింత అభివృద్ధి చేస్తాం: జేసీ

గుంటూరు వెస్ట్: విజయవాడ- గుంటూరు మధ్యలోని భవానీ ఐలాండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డి, అధికారులు గురువారం పరిశీలించారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఐలాండ్‌లోని కొంత స్థలాన్ని కేటాయించాలని టూరిజం శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో జేసీతో పాటు అధికారులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టూరిజం అంటే నిత్యం ప్రజలకు ఉపయోగపడే అంశమన్నారు. దీనివల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఉపాధి మార్గాలు కూడా మెరుగు పడతాయని తెలిపారు. భవానీ ఐలాండ్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అధికారులు కాసేపు బోట్ షికారు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సకల సౌకర్యాలు



నెహ్రూనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. గుంటూరు సెక్టార్- 1 పరిధిలోని నవభారత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భాగీదారీ ముగింపు కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు, పిల్లలకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారుల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రీ ప్రైమరీ- 1, 2 సిలబస్‌ను అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించనున్నట్లు పేర్కొన్నారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

నెహ్రూనగర్: ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర ఆధ్వర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సింక్రోసర్వ్ ఆపరేషన్స్ మేనేజర్ హర్ష రవితేజ తెలిపారు. బ్రాడీపేటలోని సింక్రోసర్వ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా కనీస విద్యార్హతతో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, సోలార్ టెక్నీషియన్‌తో పాటు ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు బ్రాడీపేట 4/15, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో లేదా 9100064573, 9390713161 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సెంటర్ హెడ్ ఎస్. కిశోర్‌బాబు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్లుగా ఇద్దరికి పదోన్నతులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇద్దరిని రెగ్యులర్ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు ఓఎస్‌డీగా ఉన్న కోటంరాజు వెంకట గోపాలకృష్ణను చేబ్రోలుకు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారికి సీసీగా పనిచేస్తున్న బి.వెంకటస్వామిని తెనాలి కబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

స్కూలు బస్సులపై కేసులు

పట్నంబజారు: విద్యా సంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు విద్యా సంస్థల బస్సులపై జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం 11 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలని చెప్పారు. తనిఖీల్లో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



పెదనందిపాడు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నార్త్ అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి ఉపకార వేతనాలు అందజేశారు. పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులు కె. లక్ష్మి, జె. శ్యామ్, టి. కుమార్, వి. రమ్యశ్రీ , కె. సునీల్‌కు ఒక్కొక్కరికీ రూ. 10 వేల చొప్పున అందజేశారు. హెచ్ఎం దుర్గా భవాని, గ్రామస్తులు కాకుమాను నాగేశ్వర రావు, సీతారామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని కల్పించిన సీఎం జగన్

- నగర మేయర్ కావటి
- టెన్త్ ఆణిముత్యాలుకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ



విద్యార్థులను సన్మానించి చెక్కులు అందజేస్తున్న మేయర్ కావటి మనోహరనాయుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పుల్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యపై సమాజంలో నమ్మకాన్ని కల్పించారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. స్తంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి-పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం పశ్చిమ నియోజకవర్గ స్థాయిలో టెన్త్ ఆణిముత్యాలుకు నగదు ప్రోత్సాహకాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ గతంలో తాము చదివిన రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడున్న వాటిలో ఏ ఒక్క వసతి లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలకు మించిన రీతిలో ఆధునిక వసతుల్ని జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చూస్తున్నామని తెలిపారు. స్తంభాలగరువులోని ఈ ఒక్క పాఠశాలనే నాడు-నేడు ద్వారా రూ.రెండు కోట్లతో ఆధునీకరిస్తున్నారంటే విద్యకు ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందని వివరించారు. చదువుకు పేదరికం, కులం అడ్డుకాదని చెప్పారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే లక్ష్యాల్ని నిర్దేశించుకుని విద్యనభ్యశించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నడూ లేని విధంగా అడ్మిషన్ల కోసం విద్యార్థులు క్యూ కడుతున్నారన్నారు. తాను స్వయంగా పలు పాఠశాలల హెచ్ఎంలకు సీట్ల కోసం రికమండ్ చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాల్ని చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక వసతులు, జేవీకే కిట్లు, ట్యాబ్‌లు, స్మార్ట్ డిస్‌ప్లేల ద్వారా ఆధునిక విద్య అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ టెన్త్‌లో ప్రతిభ చూపిన ప్రభుత్వ విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించడం బదులు నగదు ప్రోత్సాహన్ని ఇవ్వడం శుభ పరిణామమని పేర్కొన్నారు. నగర డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం వస్తాయని నమ్మిన సీఎం వై.ఎస్. జగన్ పేద, బడుగు, బలహీనవర్గాల చదువులకు కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నారని తెలిపారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గస్థాయిలో అత్యధిక మార్కులతో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల విద్యార్థులు షేక్ మునావర్, హేమశ్రీ తులసి, స్నేహను సత్కరించి వారికి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.ఐదువేలు చొప్పన నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంఈవో బలిరాం, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధి దీపాల సమస్యలపై తక్షణ చర్యలు

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో వీధి దీపాల సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వీధి దీపాల సమస్యలు రాకుండా వార్డ్ సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు కూడా తమ ప్రాంతంలో వీధి దీపాల సమస్యలు ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ ఫిర్యాదుల సెంటర్ 0863-2345103, 104,105 నంబర్లకు లేదా 9849908391కు వాట్సాప్ చేయవచ్చని ఆమె తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమోదించిన పనుల్ని వేగంగా చేపట్టాలని, ఏఈలు కూడా బాధ్యత తీసుకొని పూర్తి చేయాలని ఆమె చెప్పారు. రానున్న వర్షాల్ని దృష్టిలో ఉంచుకొని మాన్ సూన్ యాక్షన్ ప్లాన్ మేరకు పూడికతీత పనులు పక్కగా జరగాలని తెలిపారు. పనులకు ముందు తర్వాత ఫొటోలతో ఫైల్ చేయాలని పేర్కొన్నారు. తీసిన పూడికను ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా తరలించాలని ఆదేశించారు. నాడు- నేడు పనుల వేగం పెంచాలని, బిల్స్‌ను కూడా ఆన్‌లైన్ ద్వారా ప్రాసెస్ చేయాలని తెలిపారు. పార్కుల్లో సివిల్ పనులు జరిగిన వెంటనే గ్రీనరీ అభివృద్ధికి ఏడీహెచ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐలాండ్స్ పనులు కొన్నిచోట్ల నత్తనడకన జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి పూర్తయ్యేలా చూడాలని ఈఈలను ఆదేశించారు. ఏఈలు తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ చెప్పారు. సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులు పైప్‌లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు వాటర్ శాంపిల్స్ తీయాలని సూచించారు. జగనన్న లేఅవుట్స్‌లో ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగడం లేదని, వర్షాకాలంలోపు నిర్దేశిత లక్ష్యం పూర్తి కావాలని తెలిపారు. నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు శివకుమార్, రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, కల్యాణరావు, హనీఫ్, రఫిక్, హౌసింగ్ డీఈఈలు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవిత్వం అజరామరం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: మహాకవి శ్రీశ్రీ కవిత్వం అజరామరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఓ హోటల్లో గురువారం మహాకవి శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి కవి బి. విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ సాహిత్యం సమాజ మార్పుకు నాందిపలికిందని తెలిపారు. ఆయన రచనలు, సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు కవిత్వంలో మహాకవి శ్రీశ్రీ ప్రభావం కొనసాగుతూనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో కవులు ఎస్.ఎం.సుభాని, బి. కుమార్ రాజ, మధు, గాయకుడు బాబూరావు, ప్రజాసంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మంచాల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 55వ ర్యాంకు సాధించిన జి. అలేఖ్యాదేవిని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కె.వి.సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు అభినందించారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి వరకు తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిని అలేఖ్యాదేవి నీట్‌లో 55వ ర్యాంక్‌తో పాటు ఏపీ ఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయిలో 28వ ర్యాంకు సాధించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. అలేఖ్యాదేవి తండ్రి ఆర్టీసీ బస్సులో కండక్టర్‌గా పని చేస్తూ కుమార్తెను ఉన్నతస్థాయిలో చూడాలనే ఆశయంతో ఉన్నారని పేర్కొన్నారు.

విజిలెన్స్ సీఐ లక్ష్మారెడ్డి బదిలీ

నగరంపాలెం: రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో సీఐ టి.లక్ష్మారెడ్డిని బదిలీ చేశారు. ఆయన్ను గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ చేస్తూ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం

మేయర్ కావటి



జగనన్న విద్యా కానుక కిట్ అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నల్లచెరువు 22వ లైన్‌లోని నగరపాలక సంస్థ అప్పర్ ప్రైమరీ స్కూలులో గురువారం ఆయన విద్యార్థులకు జగనన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్ని పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీటు కోసం పోటీ పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. జగనన్న గోరు ముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని, దానికి అనుగుణంగానే అమ్మఒడి, విద్యా దీవెన తదితర పథకాల్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు మేయర్ వివరించారు. కార్యక్రమంలో 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్, కంతేటి శ్యాం శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

గుంటూరు రూరల్: ఇళ్లలో చోరీలకు పాల్పడే నిందితుడ్ని నల్లపాడు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం సౌత్ డివిజన్ డీఎస్పీ ఎండీ. మహబూబ్‌బాషా వివరాలు తెలిపారు. నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డులోని రెడ్డిపాలెంలో ఈనెల 7న రాత్రి కోట అక్కమ్మ ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు సీఐ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెండు బృందాలుగా దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీల ఆధారంగా ప్రస్తుతం విజయవాడ భవానీపురంలో నివాసం ఉంటున్న గుంటూరుకు చెందిన పాత నిందితుడు గుంజి గోపీకృష్ణ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా, చేసిన నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిపై గతంలో పలు ద్విచక్ర వాహన కేసులు సైతం ఉన్నాయి. అతడి వద్ద నుంచి రూ. 3 లక్షల నగదు, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అశోక్, పీసీలు కె. సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, పోతురాజు, వెంకటనారాయణను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు చోట్ల 17మంది జూదరుల అరెస్టు

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): జూద స్థావరంపై సెబ్ అధికారులు మెరుపు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు సమీపంలోని కాటూరి ఆస్పత్రి వెనుకనున్న ఖాళీ ప్రదేశంలో పెద్దఎత్తున పేకాట ఆడుతున్నారన్న సమాచారం సెబ్ ఎస్ఐ గీతతో పాటు సెబ్ ఈఎస్ఐ కె.ఎండీ. ఆరిఫ్‌లకు సమాచారం అందింది. దీంతో వారు జూద స్థావరంపై ఒక్కసారిగా దాడి చేశారు. కోత ముక్కాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 60,100తో పాటు ఎనిమిది మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఎస్ఐ గీత స్పెషల్ రిపోర్టు మేరకు ఎస్ఐ డి. రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోయవారిపాలెంలో..

మండల పరిధిలోని కోయవారిపాలెంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు అరెస్టు చేశారు. గ్రామంలోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో దాడి చేశారు. జూదరుల నుంచి రూ. 4,060ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం



పాతమల్లాయపాలెం ఆర్‌బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏవో అరుణ

ప్రత్తిపాడు: రైతులకు యాభై శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నట్లు ఏవో అరుణకుమారి తెలిపారు. ఇప్పటికే స్టాక్‌ను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు కేంద్రాల్లోని సిబ్బందిని లేదా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రతిపాడు ఆర్‌బీకేలో పిల్లిపెసర 1.6 క్వింటాళ్లు, గొట్టిపాడులో పిల్లిపెసర 2.4 క్వింటాళ్లు, గనికపూడిలో పిల్లిపెసర 1.6 క్వింటాళ్లు, యనమదలలో పిల్లిపెసర 6.4, జనుము 2 క్వింటాళ్లు, పాతమల్లాయపాలెంలో పిల్లిపెసర 2.4, జీలుగ క్వింటా, జనుము క్వింటా, వంగిపురంలో పిల్లిపెసర 2.4, జనుము 10 క్వింటాళ్లు ఉన్నట్లు ఆమె వివరించారు. యాభై శాతం రాయితీపోనూ జీలుగ విత్తనాలను కేజీ రూ. 39.50, జనుము విత్తనాలను రూ. 42, పిల్లిపెసర విత్తనాలను రూ. 48.50 అందిస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు పది కేజీల చొప్పున ఒక్కో రైతుకు ఐదెకరాల వరకూ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

మట్టి పరీక్షతో రైతుకు గట్టి మేలు

- మట్టి స్వభావం తెలుసుకునేందుకు మంచి తరుణమిదే..
- రైతులకు ఎంతో ఉపయోగమంటున్న వ్యవసాయశాఖాధికారులు.
- దిగుబడులు పెరిగేందుకు దోహదం
- ఆర్‌బీకేల పరిధిలో మట్టి నమూనాల సేకరణ



పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖాధికారి, సిబ్బంది

చేబ్రోలు: భూసార పరీక్షలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పోషకాల సమతుల్యత పాటించేందుకు రసాయనిక ఎరువులు సరైన మోతాదులో వాడేందుకు ఎంతో అవసరం. పరీక్ష ఫలితాలకు అనుగుణంగా సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశముంది. రైతులంతా ఇష్టారాజ్యంగా అధిక ఎరువుల వాడకం మూలంగా భూసారం దెబ్బతింటోంది. దీని దృష్ట్యా ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు ముందుగా మట్టి నమూనాల్ని సేకరించి భూసార పరీక్షలు చేయాలని నిర్ణయించింది.

మట్టి నమూనాల సేకరణ ప్రారంభం

ప్రస్తుతం పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలో వ్యవసాయశాఖాధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. చేబ్రోలు మండలంలోని 17 ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపారు. దీంతో పాటు భూ సార పరీక్ష వల్ల కలిగే లాభాల్ని రైతులకు వివరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో తరుణమిదేనని సూచిస్తున్నారు. మండలంలోని ప్రధానంగా వరి, మిర్చి, పత్తి, కూరగాయ పంటలు, అపరాలు తదితర పంటల్ని సాగు చేస్తున్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధి నుంచి 20 మట్టి నమూనాలను సేకరించి గుంటూరు భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈ ఏడాది కచ్చితమైన భూసారాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక యాప్ ద్వారా మట్టి నమూనాల సేకరణ జరుగుతున్నట్లు తెలిపారు.

పోషకాల సమతుల్యతతో అధిక దిగుబడులు

పొలంలో సూక్ష్మ పోషకాలు లోపించకుండా రైతులంతా శ్రద్ధ తీసుకోవాలి. జింకు, బోరాన్, జిప్సమ్ లోపాల్ని సవరించడం వల్ల అధిక దిగుబడులు పెంచుకునేందుకు వీలు కలుగుతుంది. ఖరీఫ్ సాగుకు ముందుగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచిదని వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

- పొలాల్లోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.
- మట్టి పరీక్ష ఫలితాలతో ఏ పంట వేయాలి.. ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది.
- పంట పొలాల్లో చౌడ ఆమ్ల స్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించే అవకాశం ఉంది.
- రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంది.

భూసార పరీక్షతో రైతులకు మేలు



భూసారం బాగుంటేనే పంటల దిగుబడి బాగుంటుంది. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే వాటిని సాగు చేసుకొని వేసవి దుక్కులు చేయడం మంచిది. రైతుల కోరిక మేరకు మట్టి నమూనాలు తీసుకుంటున్నాం. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు సమీపంలోని ఆర్‌బీకేలలోని వీఏఏలను సంప్రదించాలి.

–శ్రీనివాసనాయక్, ఏవో, చేబ్రోలు

ముస్లింల పక్షపాతి సీఎం వై.ఎస్.జగన్



సమావేశంలో మాట్లాడుతున్న జిలాని, ముక్తార్ బాషా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల మేలు కోరే మనసున్న వ్యక్తి అని జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ జిలాని, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా పేర్కొన్నారు. నగరంపాలెంలోని వారి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఆదాయం తక్కువగా ఉన్న మసీదులకు సంబంధించి వారిని ఆదుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా ఇమామ్‌లు, మౌజన్‌లు ఆర్థికసాయం నేటి నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆదాయం లేకుండా ఇబ్బందుల్లో ఉన్న మసీదులకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వారి దరఖాస్తుల్ని జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. మైనార్టీలకు అండగా నిలబడే సీఎం జగన్ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని, కచ్చితంగా ప్రతి ఒక్కరికీ మేలు చేకూరుస్తున్నారని తెలిపారు. వివరాల కోసం 9949546459, 8374999586 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వక్ఫ్ బోర్డు సభ్యుడు సమీవుల్లా బేగ్ పాల్గొన్నారు.

పేమెంట్ పవన్ కల్యాణ్ మాటలు హాస్యాస్పదం

గుంటూరు రూరల్: పేమెంట్ పవన్ కల్యాణ్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ తెలిపారు. నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డులోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం.. సోషల్ ఇంజినీరింగ్ అని చెప్పే పవన్ కల్యాన్ తన వారాహి వాహనంపై పదే పదే చెప్పే ఇతర సామాజిక వర్గాల నేతల్ని ఎందుకు ఎక్కించలేకపోయారని ప్రశ్నించారు. సామాజిక న్యాయం.. సోషల్ ఇంజినీరింగ్‌కి నిదర్శనం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అనే విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని సూచించారు. రాజకీయమంటే రెండు గంటల సినిమా కాదని హితవుపలికారు. సినిమాలు ఆహ్లాదం కోసం మాత్రమే చూస్తారని, రాజకీయం అంటే కోట్లాది మంది ప్రజల తలరాతలను మార్చే విషయమని పవన్ కల్యాణ్ గుర్తుంచుకోవాలని తెలిపారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గుంటూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ షేక్ మెహరున్నీసా తెలిపారు. వెంగళాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జన్‌భాగీదారి కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్నారుల అభివృద్ధి, ప్రీస్కూలుపై అవగాహన సదస్సు, గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మెహరున్నీసా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుని చిన్నారులు, తల్లులు ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుష్మ, అనిలకుమారి, అంకమ్మ, రేఖ, భాగ్యలత పాల్గొన్నారు.